
సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



పండగ పూటా పస్తులేనా..

సమగ్ర శిక్షా ఉద్యోగులు వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. అతిథి అధ్యాపకుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. - 8లో



ఈసురోమని ఇంజనీరు ఉంటే

వంశధార ఎస్ఈ జిల్లాకే రాలేకపోతున్నారు. దీని వల్ల కీలక పనులు ముందుకు సాగడం లేదు. - 8లో

ఇసుక లారీ సీజ్

రణస్థలం: మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి వద్ద తనిఖీల్లో భాగంగా జేఆర్ పురం పోలీసులు ఐదు ఇసుక లారీలను ఆపారు. ఒక ఇసుక లారీకి ఎటువంటి అనుమతి పత్రాలు లేక పోవడంతో సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. మిగతా నాలుగు లారీలకు సరైన అనుమతి పత్రాలు ఉన్నాయని చెప్పారు.

న్యూస్‌రీల్

ఈ-క్రాప్ కేవైసీ తప్పనిసరి



తోటాడ గ్రామంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆమదాలవలస: ఈ-క్రాప్ కేవైసీని రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం మండలంలోని తోటాడ గ్రామంలో ఖరీఫ్‌లో పండించే వరికి ఈ క్రాప్ నమోదు కార్యక్రమంలో భాగంగా పంట పొలాలను పరిశీలించారు. ఈ కేవైసీ జరిగిన తీరును వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ల పనితీరు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ స్ప్రేయింగ్ వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ల సాయంతో ఎరువులను పిచికారీ చేయడాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పంటల బీమా సహా నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, పీఎం కిసాన్, అన్నదాత వంటి పథకాలు వర్తించాలంటే ఈ పంట నమోదుతో ముడిపడి ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కోరాడ త్రినాథ స్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ రజిని, మండల వ్యవసాయ శాఖాధికారి మెట్ట మోహనరావు, ఇఫ్కో డీఎం టి.లోకేష్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సుధీర్, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

'పీఎం కిసాన్' సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి

ఆమదాలవలస: పీఎం కిసాన్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ త్రినాథ స్వామి సూచించారు. శనివారం మండలంలోని దూసి గ్రామంలోగల రైతు సేవా కేంద్రంలో రైతుల సమక్షంలో పీఎం కిసాన్ 18వ విడత నిధులు విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పీఎం కిసాన్ పథకం వల్ల గడిచిన ఐదేళ్లుగా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ఈ కేవైసీ ఎవరిదైనా పెండింగ్ ఉంటే అక్టోబర్ 7వ తేదీలోగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బగ్గు రజిని రైతులకు తెలియజేశారు.

మత్తుపై పెత్తనం
తమ్ముళ్ల ఒత్తిళ్ల తంత్రం



- మద్యం దుకాణాలపై పెత్తనానికి టీడీపీ కసరత్తు
- ఇష్టానుసారం దరఖాస్తు చేయవద్దంటూ వ్యాపారులకు బెదిరింపులు
- లాటరీలో దక్కించుకున్నా తర్వాత ఇబ్బందులు తప్పవని హెచ్చరిక
- నరసన్నపేటలో ప్రైవేటు పీఏ పెత్తనం
- అధికారులకు సైతం హితబోధ



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

టీడీపీ అసలు రంగు బయటపడుతోంది. కొత్త మద్యం పాలసీ విధానంలో రానున్న ప్రైవేటు మద్యం షాపులపై పెత్తనం చెలాయించేందుకు కావాల్సిన 'ఏర్పాట్లు' చేస్తోంది. ఇష్టానుసారం షాపులకు దరఖాస్తు చేయవద్దని, లాటరీ వచ్చినా ఫలితాలు వేరేలా ఉంటాయని వ్యాపారులకు ఫోన్లు వెళ్తున్నాయి. తమ సహకారం లేకుండా వ్యాపారం చేయలేరని పరోక్షంగా తేల్చి చెబుతున్నారు. సాధ్యమైనంత వరకు తమ వాళ్లే దరఖాస్తులు వేసేలా మిగతా వాళ్ల దరఖాస్తులు తక్కువ పడేలా పచ్చనేతలు కుట్రలు చేస్తున్నారు.

స్వామి కార్యం..స్వకార్యం

మద్యం విక్రయాలకు ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. ఎంత ఎక్కువ అమ్మితే ప్రభుత్వానికి అంత ఆదాయంతో పాటు పార్టీ శ్రేణులకు మంచి రాబడి వస్తుందని ప్రైవేటు మద్యం విధానం అమల్లోకి తెచ్చింది. మద్యం దక్కించుకునే వాళ్లు ఇష్టారీతిన అమ్మకాలు చేపట్టే వెసులుబాటు కల్పిస్తోంది. దీనికోసం ఒక్కో దుకాణానికి పెద్ద ఎత్తున ఫీజు నిర్దేశించింది. జనాభా ప్రాతిపదికన ఏడాదికి రూ.55లక్షల నుంచి రూ. 85లక్షల వరకు ఫీజు నిర్ణయించింది. పెట్టిన ఖర్చుకు డబుల్ సంపాదించుకోవాలని సహజంగా వ్యాపారులు చూస్తారు. ఈ లెక్కన గత టీడీపీ ప్రభుత్వంలో(2014–19)లో కొనసాగిన బెల్ట్‌షాపులు ఇప్పుడు ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా వెలిసే అవకాశం ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ ఇబ్బంది ఉండేది కాదు. కానీ కూటమి ప్రభుత్వం గత విధానానికి స్వస్తి పలికి మద్యం విక్రయాలను ప్రైవేటుకే అప్పగిస్తోంది. ఇకపై గ్రామాల్లో వీధి వీధినా, గడప గడపకు మద్యం దొరికినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

మొదలైన లాబీయింగ్

ప్రైవేటు మద్యం పాలసీ ఎప్పుడెప్పుడా అని చాలా మంది టీడీపీ నేతలు ఎదురు చూస్తున్నారు. అధికారం చేతిలో ఉండటం, అధికారులు చెప్పినట్టు వ్యవహరించే అవకాశం ఉండటంతో ఖజానాలు నింపుకోవడానికి సిద్ధమయ్యారు. తమకు తప్ప వేరే వ్యక్తులకు మద్యం దుకాణాలు దక్కకూడదన్న కసితో ఉన్నారు. ముందు దుకాణాలు దక్కించుకుంటే తర్వాత సిండికేట్ కోసం ఆలోచించి, రేట్ల కోసం నిర్ణయం తీసుకోవచ్చన్న అభిప్రాయంతో మద్యం దుకాణాల కోసం లాబీయింగ్‌తో పాటు బెదిరింపులకు దిగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న 158 దుకాణాలను సాధ్యమైనంతవరకు తమ వాళ్లే దక్కించుకునేలా పావులు కదుపుతున్నారు.

మేమే డిసైడ్ చేస్తాం..

మద్యం షాపుల కోసం ఇష్టానుసారంగా దరఖాస్తులు వేయవద్దని నరసన్నపేటలో ప్రైవేటు పీఏ ఫోన్లు చేసి వార్నింగ్ ఇస్తున్నారు. ఇదే వాయిస్‌తో మరి కొంతమంది తెలుగు తమ్ముళ్లు కూడా ఔత్సాహిక వ్యాపారులను బెదిరిస్తున్నారు. ఏ షాపునకు ఎవరు వేయాలన్నది తామే డిసైడ్ చేస్తామని, తొందరపడి దరఖాస్తు చేసి ఇబ్బందులు తెచ్చుకోవద్దని సూచన ప్రాయంగా చెప్పేస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో 20వరకు షాపులు ఉన్నాయి. ఇవన్నీ సాధ్యమైనంతవరకు తమ వాళ్లకే దక్కాలన్న ఆలోచనతో బయట వ్యక్తులను కట్టడి చేస్తున్నారు. నరసన్నపేటలోనే కాదు జిల్లాలోని మరికొన్ని నియోజకవర్గాల్లో కూడా ఇదేరకమైన సంకేతాలను ఔత్సాహిక వ్యాపారులకు పంపిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల కీలక నేతల కుటుంబీకుల కనుసైగల్లోనే మద్యం దుకాణాలకు దరఖాస్తులు పడేలా చూసుకుంటున్నారు.

అధికారులతో రహస్య సమావేశాలు



బయట వ్యక్తులు, తమ పార్టీ కాని వారు దరఖాస్తు చేస్తే లాటరీలో పోటీ ఎక్కువగా ఉంటుందని, అదృష్టం ఎవరిని వరిస్తే వారికే షాపులు దక్కుతాయని, అదే జరిగితే తమకు మేలు జరగదనే ఉద్దేశంతో సాధ్యమైనంతవరకు దరఖాస్తులు తక్కువ పడేలా చూసుకుంటున్నారు. దానిలో భాగంగా కొన్నిచోట్ల అధికారులతో కీలక నేతలు రహస్య సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. షాపులకు దరఖాస్తులు తక్కువ పడేలా చూడాలని, తమకు షాపులు దక్కేలా చూడాలని హుకుం జారీ చేస్తున్నారు. ఒకవేళ పోటీ అవసరమనుకుంటే మనోళ్లే దరఖాస్తులు వేస్తారని, వేరే వ్యక్తులకు అవకాశం ఇవ్వవద్దని హితబోధ చేస్తున్నట్టు కూడా తెలిసింది.

గాయత్రి మాతగా..



శ్రీకాకుళం నానుబాల వీధిలో విజయదుర్గ అమ్మవారిని శనివారం గాయత్రిమాతగా అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. – శ్రీకాకుళం కల్చరల్

వెలుగుల పండగ



పెంట గ్రామంలో శనివారం దీపోత్సవం నిర్వహించారు. దుర్గాదేవి నవరాత్రులు సందర్భంగా 50 వేల ప్రమిదలతో అరకిలో మీటరు దూరాన్ని ప్రకాశవంతంగా మార్చేశారు. శ్రీరామాయూత్ సభ్యులు కార్యక్రమ ఏర్పాటు చేశారు. – జి.సిగడాం

అబ్కారీ శాఖ మాటలపై నమ్మకం లేదు


శ్రీకాకుళం క్రైమ్ : తమ ఉద్యోగ భద్రతకు భరోసా కల్పిస్తామంటున్న రాష్ట్ర అబ్కారీ శాఖ మాటలపై నమ్మకం కలగడం లేదని జిల్లా సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ సంఘ అధ్యక్షుడు కీర్తి ధర్మారావు, అదే సంఘ స్టేట్ యూనియన్ సభ్యుడు బి.శ్రీను అన్నారు. రాష్ట్ర అబ్కారీ శాఖ ఎండీ ముఖేష్‌కుమార్ మీనాతో చర్చల్లో భాగంగా శనివారం జిల్లా తరఫున వీళ్లు విజయవాడ వెళ్లారు. ఈ సందర్భంగా చర్చల అనంతరం 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించకపోగా తమకు ఇష్టం లేకపోయినా, బలవంతంగా షాపుల్లో ఎక్సైజ్ పోలీసులతో బెదిరించి మరీ విధుల్లో పాల్గొనేలా చేస్తోందన్నారు. ఈ విషయమై ఎండీతో శనివారం చర్చలు జరిపామన్నారు. ఇవన్నీ చూస్తుంటే మమ్మల్ని వాడుకునే ఉద్దేశంతోనే మోసపూరిత మాటలు చెబుతున్నట్లు అర్థమవుతుందని అన్నారు.



కేశవరావు క్షేమమేనా..?

- చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌తో ఉలిక్కిపడిన సిక్కోలు
- కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేటలో కలకలం
- మన జిల్లాకు చెందిన మావోయిస్టు అగ్రనేత కేశవరావు కోసం ఆందోళన
- ఎదురుకాల్పుల్లో చిక్కుకున్నారని వదంతులు
- స్పష్టత లేక కుటుంబ సభ్యుల్లో ఆందోళన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:



కేశవరావు(ఫైల్)

చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ–నారాయణపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌తో జిల్లా ఉలిక్కి పడింది. మన జిల్లాకు చెందిన మావోయిస్టు అగ్రనేత కేశవరావు ఈ ఎన్‌కౌంటర్‌లో చిక్కుకున్నారని వదంతులు రావడం, దీనిపై ఎవరూ స్పష్టత ఇవ్వకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. నంబాళ్ల కేశవరావు (అలియాస్ గంగన్న, అలియాస్ బసవరాజు) దశాబ్దాల కిందటే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇప్పుడు ఎన్‌కౌంటర్‌లో ఆయన ఉన్నారన్న ప్రచారంతో కోటబొమ్మాళి మండలంలోని ఆయన స్వగ్రామం జియ్యన్నపేటలో కలకలం రేగింది. సీపీఎం ఎంఎల్(మావోయిస్టు) జాతీయ కార్యదర్శి హోదాలో ఉన్న కేశవరావుకు ఏం జరిగిందనే ఉత్కంఠ జిల్లా వ్యాప్తంగా నెలకొంది.

చిన్నప్పటి నుంచే అభ్యుదయ భావాలు

ప్రస్తుతం మావోయిస్టు సెంట్రల్ కమిటీలో అగ్రస్థానంలో ఉన్న కేశవరావు చిన్నప్పటి నుంచి అ. భ్యుదయ భావాలు ఉన్న వ్యక్తి. కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామానికి చెందిన నంబాళ్ల వాసుదేవరావు (ఉపాధ్యాయుడు) లక్ష్మీనారాయణమ్మ ఇద్దరు కుమారుల్లో రెండో సంతానం కేశవరావు. ఆ తర్వాత ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో 1 నుంచి 5 వరకు స్వగ్రామమైన జియ్యన్నపేటలో ప్రాథమిక విద్యనభ్యసించారు. ఆ తర్వాత 6 నుంచి 10 వరకు టెక్కలి మండలం తలగాం ఎట్నౌపడ ఆర్ఎస్‌లో విద్యనభ్యసించారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ పూర్తి చేసి 1971లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ కోర్సులో చేరారు. ఏడాది తర్వాత వరంగల్ ఆర్ఈసీ (ప్రస్తుతం ఎన్ఐటీ) ఇంజనీరింగ్ కళాశాలలో మెటలార్జికల్ కోర్సులో చేరారు. ఆ కళాశాలే కేశవరావు జీవితాన్ని మావోయిస్టు భావాల వైపు నడిపించిందంటూ సొంత గ్రామస్తులు చెబుతుంటారు. విద్యార్థి దశలో తన స్వగ్రామం వచ్చి తనకు రావాల్సిన వాటాను ఆస్తిగా ఇస్తే, పేదలకు పంపిణీ చేస్తానని తండ్రిని అడిగినట్టు సమాచారం. అయితే అన్నదమ్ముల చదువులకే ఆస్తి సరిపోయిందని తన తండ్రి చెప్పడంతో ఇళ్లు విడిచి వెళ్లిపోయినట్టు గ్రామస్తులు తెలిపారు. ఆయన సోదరుడు వివిధ పోర్టుల్లో ఉన్నతాధికారిగా పనిచేశారు.



జియ్యన్నపేటలోని కేశవరావు గృహం

భారీ రివార్డు..

1979వ సంవత్సరంలో వరంగల్ కళాశాలలోని మెస్‌లో జరిగిన చిన్నపాటి వివాదం కేశవరావు జీవితాన్ని మలుపు తిప్పింది. రాడికల్ స్టూడెంట్ యూనియన్ లీడర్‌గా కేశవరావు బాధ్యతలు చేపడుతున్న సమయంలో జరిగిన వివాదం కారణంగా ఓ కేసులో ఆయన చిక్కుకున్నారు. అనంతరం వరంగల్‌లో కేశవరావును పోలీసులు విచారణ చేశారు. 1980లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన కేశవరావు 1982లో చింతపల్లి ప్రాంతంలో పోలీసులకు పట్టుబడ్డారు. కొన్ని రోజులు విశాఖపట్టణం సెంట్రల్ జైలులో ఉంటూ బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆ తర్వాత ఆయన ఆచూకీ లేదు. దశల వారీగా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఎల్‌టీటీఈ మాజీ యోధుల శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన మావోయిస్టుల ప్రముఖుల్లో ఈయన ఒకరని సమాచారం. 2018లో కేంద్ర ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి అనారోగ్య సమస్యల కారణంగా రాజీనామా చేయడంతో కేశవరావు ఆ బాధ్యతలు స్వీకరించినట్టు సమాచారం. కేశవరావుపై రూ.కోటి రివార్డును ప్రభుత్వం ప్రకటించినట్టు కూడా వార్తలు వచ్చాయి. కేశవరావు తల్లి చనిపోవడంతో ఆయన తండ్రి రెండో వివాహం చేసుకున్నారు.



జియ్యన్నపేటలోని కేశవరావు స్వగృహం ఉన్న వీధి

క్లుప్తంగా

8న జాబ్‌మేళా

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లత తెలిపారు. డిగ్రీ, ఐటీఐ ఫిట్టర్, ఎంఎస్సీ కెమిస్ట్రీ, డిప్లమా సివిల్, బీటెక్, మెకానికల్ డిగ్రీ కంప్యూటర్స్ చదువుకున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని 8న సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. అపోలో ఫార్మసీ, ఆర్‌వైకే టెక్, హెట్రో, హెచ్‌డీఎఫ్‌సీ, డైకిన్ కంపెనీల నుంచి ప్రతినిధులు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కె.గోవిందరావు (9949900672), జి.గౌతం(9550967353)లను సంప్రదించాలని సూచించారు.

నగదు చెక్కు అందజేత



సురేష్ భార్య దుర్గాభవానీకి చెక్కు అందజేస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : అనారోగ్యంతో మరణించిన హోంగార్డు కుటుంబానికి తోటి హోంగార్డుల ఒక్క రోజు వేతనం రూ. 4.29 లక్షల నగదు చెక్కును ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అందజేశారు. జిల్లా హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తున్న జి.సురేష్ ఇటీవల మరణించడంతో అతని భార్య దుర్గాభవానీని శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి ఈ చెక్కును ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి సహాయం కావాలన్నా జిల్లా పోలీసు శాఖ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద, ఏఆర్ సీహెచ్ గోపీనాథ్, ఆర్ఎస్ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి క్రికెట్ క్రీడాకారిణుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న డైరెక్టర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌యూకేటీ) ప్రీ యూనివర్సిటీ కోర్సు విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు అండర్-19 విభాగంలో ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో వీరు రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు అర్హత సాధించారు. ఈ క్రీడాకారిణులు సీహెచ్ దీపిక, ఎస్.తేజశ్విని, కె.మేఘన, వై.మౌనికలు ఎంపికయ్యారు. వీరిని శనివారం క్యాంపస్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన కృష్ణ చౌదరిలతో కూడిన అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. క్యాంపస్‌లో ప్రత్యేక సాధనకు అవకాశం కల్పిస్తామని అన్నారు.

డెంగీ బాధితురాలికి రక్తదానం



రక్తదానం చేస్తున్న రమణమూర్తి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విజయహర్ష తల్లీపిల్లల వైద్యశాలలో డెంగీ జ్వరంతో చేరిన నిరుపమ(4)కు అంపోలుకు చెందిన వీరఘట్టపు రమణమూర్తి తన రక్తం అందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. అరసవల్లికి చెందిన పి.శివప్రసాద్ కుమార్తె డెంగీ జ్వరంతో ఆస్పత్రిలో చేరగా ప్లేట్ లెట్స్ కౌంట్ తగ్గింది. ఆ పాపకు ఎ నెగెటివ్ ఎస్‌డీపీ(సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్) అవసరం ఏర్పడింది. అరుదైన బ్లడ్ గ్రూపు కావడంతో మదర్స్ లవ్ ఫౌండేషన్ ప్రతినిధి సుప్రజ రౌత్, సభ్యులు అల్లాడ నవీన్‌ల ద్వారా అంపోలుకు చెందిన రమణమూర్తిని సంప్రదించగా ఆయన రక్తదానం చేశారు. ఇలాంటి అరుదైన ఏ నెగెటివ్ రక్తదాతలు ఎవరైనా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సూపర్‌వైజర్ ఆర్.వెంకటేష్, నంది ఉమాశంకర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు పూర్తి



రిపోర్టు చేస్తున్న కబడ్డీ క్రీడాకారిణులు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆది, సోమవారాల్లో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. పాఠశాలలోనే స్టూడెంట్లకు వసతి కల్పిస్తున్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి 156 మంది హాజరు కానున్నారు. జిల్లా పీడీ, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షులు మొజ్జాడ వెంకటరమణ ఆధ్వర్యంలోని పీడీలు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

పండగ పూటా పస్తులేనా!

- జీతాలకు నోచుకోని సమగ్రశిక్షా ఉద్యోగులు, ఇంటర్‌విద్య గెస్ట్ ఫ్యాకల్టీలు
- రెండు నెలలుగా జీతాలకు నోచుకోని సమగ్రశిక్షా ఉద్యోగులు
- విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా గెస్ట్ ఫ్యాకల్టీలకు జీతం సున్నా
- దసరా వేళ చేతికి జీతం రాక ఆందోళన



తమ జీతాల విషయమై ఇంటర్ విద్య డీవీఈఓ ఎస్.తవిటినాయుడును కలిసి మాట్లాడుతున్న గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ, నరసన్నపేట: పాఠశాల విద్యకు అనుబంధంగా ఉన్న వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది జీతాలు లేక అల్లాడుతున్నారు. ముఖ్యంగా సమగ్రశిక్షా పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు నెలలగా జీతాలు అందడం లేదు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు ముగిసినా ఇప్పటికీ నయాపైసా జీతం రాలేదు. దసరా పండగ వస్తున్న సమయంలో చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పండగొస్తే కన్నీరే..

సాధారణంగా ఎవరికైనా పండగొస్తే ఎక్కడలేని ఆనందం, సంతోషం. కానీ చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం పండగొస్తే కన్నీరు తప్పడంలేదు. పెండింగ్ జీతాలను కలుపుకొని వీరందరికీ చెల్లించాల్సిన జీతాలు కేవలం రూ. 7.5 కోట్లు మాత్రమే. విజయదశమి పండగ రోజుకైనా జీతాలు ఇప్పించేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఉద్యోగులు, సిబ్బంది వేడుకుంటున్నారు. ఇదే విషయమై జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్యని 'సాక్షి' సంప్రదించగా దసరా లోపు వేతనాలు వచ్చేలా చూస్తామన్నారు.

సమగ్ర శిక్షాలో ఇలా..

సమగ్రశిక్ష పరిధిలో ప్రభుత్వ/జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పార్ట్‌టైం(ఆర్ట్,క్రాఫ్ట్,పీఈటీ) ఇన్‌స్ట్రక్టర్లు, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేసే ఎంఐఎస్‌లు కోఆర్డినేటర్లు, సీఆర్‌పీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఐఈఆర్‌పీలు, జిల్లా, డివిజనల్ స్థాయి కార్యాలయాల్లో వివిధ హోదాల్లో పనిచేసే కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ స్టాఫ్ సమగ్రశిక్ష పరిధిలో 2410 మంది వరకు పనిచేస్తున్నారు. వీరికి నెలకు కనిష్టంగా రూ.15వేల నుంచి గరిష్టంగా రూ.23వేల వరకు జీతాలు చెల్లిస్తున్నారు. వీరందరికీ రెండు నెలలగా జీతాలు లేవు.

కేజీబీవీల్లో ఇలా..

సమగ్రశిక్షా పరిధిలోనే పనిచేసే కేజీబీవీల్లో ప్రిన్సిపాళ్ల(స్పెషల్ ఆఫీసర్ల)తోపాటు సీఆర్‌టీలు, పీజీటీలు, అకౌంటెంట్లు, అటెండర్లు, ఆయాలుగా 690 మంది వరకు మహిళా ఉద్యోగులు సేవలు అందిస్తున్నారు. వీరికి కనిష్టంగా రూ.15వేల నుంచి గరిష్టంగా రూ.34వేల వరకు జీతాలను చెల్లిస్తున్నారు. వీరు కూడా రెండు నెలలుగా జీతాలకు నోచుకోవడం లేదు.

జూనియర్ కాలేజీల్లో..

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గత పదేళ్లుగా పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు ఆది నుంచి తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉంది. చెల్లిస్తున్న అరకొర జీతాలైనా సకాలంలో చెల్లించకపోతుండటంతో వారు తీవ్రమైన వేదనకు గురవుతున్నారు. వారికి నెలకు గరిష్టంగా నెలకు చెల్లించేది రూ.10వేలే అయినా అది కూడా సకాలంలో రావడంలేదని అంటున్నారు. ఈ విద్యా సంవత్సరం జూన్ ఒకటి నుంచి ప్రారంభం కాగా ఇప్పటికి జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నాలుగు మాసాలు పూర్తయినప్పటికీ జీతాలు చెల్లింపులు కావడం లేదని గెస్ట్ లెక్చరర్ల సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరు రాష్ట్ర వ్యాప్తంగా 1054 మంది పనిచేస్తుండగా శ్రీకాకుళం జిల్లాలో 105 మంది వరకు పాఠాలు బోధిస్తున్నారు. మొత్తం ఉద్యోగులు, సిబ్బంది వీరందరి జీతాల చెల్లింపులు జాప్యం కావడానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్టే కారణమని తమకు అధికారులు బదులిస్తున్నారని వారంతా చెబుతున్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

సమగ్రశిక్షా పరిధిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాల చెల్లింపులుకాని మాట వాస్తవమే. దసరా పండగ వస్తోంది. ఇంటిల్లిపాదీ పస్తులు ఉండేలా చేయకుండా పెండింగ్ జీతాలు చెల్లింపులు జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకుంటున్నాం.

– ఎర్ర సత్యనారాయణ, దిలీప్ లోపింటి, గుడివాడ కామేష్, శ్రీకాకుళం జిల్లా సమగ్రశిక్ష పీటీఐ యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

మార్చి నెల వరకే జీతాలు ఇచ్చారు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత పదేళ్లుగా అరకొర జీతాల చెల్లింపులతోనే పనిచేస్తున్నాం. వృత్తిపై మమాకారం, ప్రభుత్వాలు ఏదో ఒక రోజు మేలు చేయకపోతాయా అనే నమ్మకంతో పనిచేస్తున్నాం. జిల్లాలో మాకు మార్చి నెల వరకే జీతాలు వచ్చాయి. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఎలాంటి జీతాలు చెల్లింపులు కాలేదు. బిల్లులు జిల్లా డీవీఈఓ కార్యాలయానికి సబ్మిట్ చేశాం. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే.

– బద్ద గణేష్, ఏపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల రాష్ట్ర గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ కోశాధికారి, శ్రీకాకుళం

ఈసురోమని ఇంజినీరు ఉంటే..

- అందుబాటులో ఉండని వంశధార ఎస్ఈ రాంబాబు
- మూడిళ్ల పూజారిగా అగచాట్లు
- జూన్ 16 నుంచి 110 రోజుల్లో పట్టుమని పదిసార్లు రాక



వంశధార సర్కిల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఎస్ఈ కుర్చీ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాకు ఆయువు పట్టులాంటి వంశధార ప్రాజెక్టును పర్యవేక్షించేందుకు అధికారులు లేక పనులు మందగిస్తున్నాయి. ప్రస్తుతం వంశధార స్టేజ్-2, ఫేజ్-2 పనులు, హిరమండలం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్, ఆఫ్‌షోర్ రిజర్వాయర్, నాగావళి-వంశధార ఇంటర్‌లింకింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులన్నీ సకాలంలో పూర్తిచేయాలంటే పూర్తిస్థాయిలో ఇంజినీర్లు ఉండాలి. కానీ ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి సూపరింటెండెంట్ ఇంజినీర్ జిల్లాకు కనీసం అందుబాటులో కూడా ఉండడం లేదు. గతంలో ఎస్ఈగా తిరుమలరావు నిరంతరం అందుబాటులో ఉండేవారని రైతులకు, తమ శాఖ ఉద్యోగులకు, కాంట్రాక్టులకు ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించేవారని ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమలరావుపై వేటు వేసి విజయవాడలో ఉన్న కడా (కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న రాంబాబుకు వంశధార ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా ఇటీవల కృష్ణా డెల్టా సిస్టమ్ (కె.డి.ఎస్) సీఈ (చీఫ్ ఇంజినీర్)గా కూడా బాధ్యతలు అప్పగించారు. ఇన్ని పనుల మధ్య ఆయనకు శ్రీకాకుళం రావడానికే సమయం సరిపోవడం లేదు. మరోవైపు టెక్కలి ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) శేఖర్ పనులను చక్కబెట్టుకోవడానికి ఎస్ఈగా రాంబాబుని బలవంతంగా ఇక్కడకు తెచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వ్యయ ప్రయాసలు..

వంశధార ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన రాంబాబు జూన్ 16 నుంచి ఇప్పటివరకు మొత్తంగా 110 రోజుల్లో పట్టుమని పదిరోజులు కూడా వంశధార సర్కిల్ కార్యాలయంలో అందుబాటులో లేరని ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు. అత్యవసరమైన కీలక ఫైళ్లపై సంతకాలు కావాలంటే అటెండరో, కాంట్రాక్టరో హుటాహుటిన విజయవాడ వెళ్లి వస్తున్నారని అంటున్నారు. దీంతో వ్యయప్రయాసలు తప్పడం లేదని గగ్గోలు పెడుతున్నారు.

మంత్రులు హాజరైనా..

వంశధార ప్రాజెక్టు రూపకర్త, చిక్కోలు కాటన్‌గా పేరుగాంచిన సీఆర్ఎం పట్నాయక్ శతజయంతి సందర్భంగా వంశధార సర్కిల్ కార్యాలయంలో ఆయన విగ్రహంతో పాటు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఇటీవలే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులు హాజరైనా ఎస్ఈ రాంబాబు మాత్రం హాజరుకాలేదు. సీఈ, ఎస్ఈ పోస్టులు చేపడుతున్న కారణంగా విజయవాడ నుంచి ఇక్కడకు రాలేకపోతున్నారు.

ఎస్ఈపై ఆమదాలవలస ఎమ్మెల్యే ఫైర్

మూడు రోజుల కిందట ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎస్ఈపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వ్యవసాయ సీజన్ కావడంతో రైతులకు నీరందడం లేదన్న విషయాన్ని విన్నవించుకుందామని వంశధార కార్యాలయానికి వస్తే ఎవ్వరూ అందుబాటులో ఉండడం లేదని మండిపడినట్లు కొంతమంది చెబుతున్నారు. ఖరీఫ్ సాగుకి నీరందించడంలో విఫలమైనా కనీసం రబీకి అయినా సాగునీరు అందించేందుకు అధికారులు దృష్టి సారించాలని జిల్లాలో రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లాలో గల కేంద్ర, రాష్ట్ర మంత్రులు చొరవచూపి పూర్తిస్థాయిలో పనిచేసే ఎస్ఈని వేయాలని రైతులు, ఆ శాఖ సిబ్బంది కోరుతున్నారు.

సగమైనా నిండలేదు

ఎచ్చెర్ల క్యాంపస్:

ఏపీ పీజీ సెట్-2024 రెండో విడత కౌన్సెలింగ్ ప్రవేశాలను ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. కనీసం సగం సీట్లు కూడా నిండలేదు. వర్సిటీలో 16 కోర్సులు ఉండగా, 562 సీట్లు ఉన్నాయి. 243 సీట్లు నిండాయి. 43.23 శాతం ప్రవేశాలు జరిగాయి. 319 సీట్లు మిగిలిపోయాయి. మొదటి విడత కౌన్సెలింగ్‌లో 259 ప్రవేశాలు జరిగాయి. రెండో కౌన్సెలింగ్ సీట్లు 16 సీట్లు తగ్గాయి. మొదటి కౌన్సెలింగ్‌లో 46.08 శాతం ప్రవేశాలు జరగ్గా, రెండో కౌన్సెలింగ్‌లో 43.23 శాతం ప్రవేశాలు జరిగాయి. కొన్ని కోర్సుల్లో కనీస ప్రవేశాలు జరగలేదు. తెలుగు, సోషల్‌వర్క్, జర్నలిజం, ఎంఎల్ఐ ఎస్సీ, రూరల్ డెవలప్‌మెంట్, ఎకనామిక్స్, అప్లైడ్ మ్యాథ్స్, మ్యాథ్స్ కోర్సుల్లో సింగిల్ డిజిట్ ప్రవేశాలు మాత్రమే జరిగాయి.

కోర్సు	సీట్ల సంఖ్య	ప్రవేశాలు సంఖ్య
ఇంగ్లిష్	40	29
తెలుగు	40	07
సోషల్ వర్క్	40	05
ఎంజేఎంసీ	30	05
ఎంఎల్ఐఎస్సీ	40	07
రూరల్ డెవలప్‌మెంట్	40	07
ఎకనామిక్స్	40	05
ఎంకాం	40	38
ఎంఈడీ	40	11
బయోటెక్నాలజీ	33	29
మైక్రోబయోలజీ	22	20
అప్లైడ్ మ్యాథ్స్	22	06
మ్యాథ్స్	40	06
ఫిజిక్స్	40	17
ఎనాటికల్ కెమిస్ట్రీ	22	21
ఆర్గానిక్ కెమిస్ట్రీ	33	30

ఆర్డీఓల బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను కలిసిన టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం ఆర్డీఓగా నియమితులైన కె.సాయి ప్రత్యూష, టెక్కలి ఆర్డీఓగా బదిలీపై వచ్చిన ఎం.కృష్ణమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు వారిద్దరూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలను అందజేశారు.

2023 గ్రూప్-1 బ్యాచ్ కు చెందిన ఈ ఇద్దరు అధికారులు ఇటీవలే శిక్షణ పూర్తి చేసుకుని తొలిసారిగా ఆర్డీఓలుగా నియమితులయ్యారు. టెక్కలి ఆర్‌డీఓ కృష్ణమూర్తి ఎంటెక్ పట్టభద్రులు. ఆయన గతంలో పోలీసు శాఖలో ఎస్ఐగా పదేళ్లపాటు పనిచేశారు. శ్రీకాకుళం ఆర్‌డీఓ ప్రత్యూష ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ (హానర్స్) చదివారు. చిత్తూరు జిల్లాలో పంచాయతీ సెక్రటరీగా పనిచేశారు. అనంతరం గ్రూప్-1 లో ఆర్‌డీఓ కేడర్‌లో ఎంపికై శిక్షణ పొందారు.

ఫిర్యాదుల పరిష్కారమే ధ్యేయం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ప్రజలకు మరింత చేరువగా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారమే ధ్యేయంగా సోమవారం (జిల్లాకేంద్రంలో), శుక్రవారం (కాశీబుగ్గలో) మీకోసం కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు, కాశీబుగ్గ పీఎస్‌లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహిస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌కు నేటి నుంచి 13 వరకు సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌కు ఆదివారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. రాష్ట్రంలోని నాలుగు క్యాంపస్‌లకు ఈ సెలవులు ప్రకటించగా, విద్యార్థులు ఔట్ పాస్‌లు తీసుకొని శనివారం పయనమవుతున్నారు. బాలికలను సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లో క్యాంపస్ నుంచి అధికారులు పంపించే చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభించనున్నారు.

నాన్ టీచింగ్ సిబ్బందికి నైపుణ్య పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్ సిబ్బందికి శనివారం స్కిల్ పరీక్షలు నిర్వహించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయానికి చెందిన నాన్ టీచింగ్ అధికారులు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. క్లర్క్ స్థాయి నుంచి సిబ్బంది ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ ఆధారంగా అధికాలకు నివేదిక ఇవ్వనున్నారు. పదోన్నతుల అంశానికి సంబంధించి ఈ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు సమాచారం. కంప్యూటర్ పరిజ్ఞానం, ఇతర పరీక్షలు వంటివి నిర్వహించలేదు. కాంట్రాక్టు, టైమ్ స్కేల్, ఔట్ సోర్సింగ్, కన్సోలిటెడ్ పే ఉద్యోగులు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వర్సిటీ అధికారులు పర్యవేక్షించారు.

ఎమ్మార్పీ కంటే అదనంగా..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని కిన్నెర కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరకు (అదనంగా రూ.10లు) మద్యం విక్రయిస్తున్నట్లు కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. 1087 కోడ్ నంబర్ గల ప్రభుత్వ మద్యం దుకాణంలో ఓ కానిస్టేబుల్ ప్రైవేటు వ్యక్తులతో ఈనెల 3 నుంచి మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఆ షాపులో సూపర్‌వైజర్ సాయి మోహన్, సేల్స్‌మెన్లు శ్యామ్, సింహాద్రి, పేరయ్యలు పనిచేస్తుండేవారు. బాట్లింగ్ డీపీఓగా ఉన్న వెంకటేశ్వరరావు అక్టోబరు 3 నుంచి జిల్లాలో ఉన్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు తమతమ షాపుల్లో విధుల్లోకి చేరిపోవాలని చెప్పారని జిల్లా సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ సంఘ కార్యదర్శి సంతోష్‌కుమార్ అన్నారు. ఈ క్రమంలో తమ వాళ్లు కిన్నెర కాంప్లెక్సు వద్ద ఉన్న షాపు వద్దకు వెళ్తే అక్కడ వీవో(కానిస్టేబుల్) తీసుకోలేదని, దీంతో తాను రాజీనామా చేశానని, సేల్స్‌మెన్ ఇద్దరినీ వేరే షాపులో వేశారని చెప్పారు. కొత్త పాలసీ అమలు కాక ముందే ప్రైవేటు వ్యక్తులకు షాపులు ఇచ్చి ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మడమేంటని కొనుగోలుదారులు ప్రశ్నించారు.

పది తులాల బంగారం చోరీ



సుదియా కళావతి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన సంఘటన యావత్తు పోలీసులకే సవాల్ విసిరింది. కాశీబుగ్గ బస్టాండ్‌కు సమీపంలో పోలీసు స్టేషన్‌కు వెళ్లేదారిలో దొంగతనం చోటుచేసుకుంది. సుడియా కళావతి అనే మహిళ తన ఇంటిలో మధ్యాహ్నం భోజనం చేస్తుండగా ఇంటి ముందుకు చేరిన దుండగుడు అడ్రస్ అడిగినట్టు నటించాడు. అలా మాట్లాడుతూనే ఆమెను కిందకు తోసి మెడలో ఉన్న పది తులాల బరువు గల ఐదు బంగారు వస్తువులు తెంపేసి పారిపోయాడని బాధితురాలు తెలిపింది. ఒక్కసారిగా తేరుకుని బయటకు వచ్చి కేకలు వేసినప్పటికీ పరారైపోయాడని, విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సీఐ మోహనరావు కేసు నమోదు చేశారు.

ప్రణాళికాబద్ధంగా ఖరీఫ్ ధాన్యం సేకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు అనుసరించాల్సిన విధి విధానాలపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా, ధాన్యం సేకరణ కేంద్రాలు, సీఎంఆర్ రైస్, కనీస మద్దతు ధర వంటి అంశాలపై చర్చించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందనే అంచనాకు గాను దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320లుగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించినట్లు ఆయన వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఈ-పంట కింద 3,59,616 ఎకరాలు నమోదైందని, ఈ కేవైసీ 3,26,521 ఎకరాలకు పూర్తయిందని వివరించారు. ఈ- కేవైసీలో రాష్ట్ర సగటును చేరుకోని మండలాలు రెండు రోజుల్లో నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

కార్పు జాతిచేపల పెంపకంపై అవగాహన



కేవీకేలో మాట్లాడుతున్న అనకాపల్లి పరిశోధన స్థానం సహ సంచాలకులు ముకుందరావు

ఆమదాలవలస: కార్పు జాతి చేపల పెంపకంతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని అనకాపల్లి పరిశోధన స్థానం సహ సంచాలకులు సీహెచ్ ముకుందరావు అన్నారు. శనివారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కార్పుజాతి చేపల పెంపకంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై కేవీకే, జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సంయుక్తంగా మత్స్యకారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ మత్స్యకారులకు చేపల పెంపకంపై ఉత్తమ యాజమాన్య పద్ధతులను వివరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న నీటి వనరుల్లో చేపల పెంపకం శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టడం ద్వారా ప్రస్తుతం ఉన్న దిగుబడులను రెట్టింపు చేసుకోవడానికి అవకాశం ఉందని అన్నారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో వస్తున్న నూతన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ రైతులకు మంచినీటి చెరువుల్లో పెంచడానికి వీలయ్యే రకాలు వాటి లక్షణాలు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రణస్థలం: మండల కేంద్రంలోని పాత పెట్రోల్ బంకు సమీపంలో గల సర్వీస్ రోడ్డు మలుపు వద్ద శుక్రవారం రాత్రి సమయంలో కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు సురేష్ కుమార్ తలకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. దీంతో శ్రీకాకుళం తీసుకువెళ్లి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి స్వగ్రామం శ్రీముఖలింగం. ఈ ప్రమాదంపై జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

వృద్ధుడి ప్రాణాలు కాపాడిన వీఆర్వో



నదిలో నుంచి అప్పారావును బయటకు తీసుకువస్తున్న వీఆర్ఓ

నరసన్నపేట: మడపాం వద్ద వంశధార నదిలో పడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన బొట్ట అప్పారావు అనే వృద్ధుడిని వీఆర్ఓ మారెళ్ల అప్పలనాయుడు కాపాడారు. వృద్ధునికి సపర్యలు చేసి నచ్చజెప్పి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. కోటబొమ్మాళి మండలం పట్టుపురానికి చెందిన బొట్ట అప్పారావు శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో నదిలో నీరు అధికంగా ప్రవహిస్తున్న వైపు వెళ్లి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. దూరం నుంచి గమనించిన అదే గ్రామానికి చెందిన వీఆర్ఓ అప్పలనాయుడు గట్టిగా కేకలు వేశారు. కానీ అప్పటికే అప్పారావు దూకేసి చేతులు పైకెత్తి కొట్టుకోవడం ప్రారంభించారు. వీఆర్ఓ వెంటనే నదిలోకి వెళ్లి అప్పారావును బయటకు తీశారు. ఆ వృద్ధుడు 'నన్ను వదిలేయండి నేను చనిపోతా.. నాకు ఎవరూ లేరు.. నేను జీవించడం వృథా' అని అంటుండడంతో వీఆర్ఓ ఆయనకు నచ్చజెప్పి కాసేపయ్యాక భోజనం పెట్టి వివరాలు సేకరించి కోటబొమ్మాళి పోలీసుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం పంపారు. వారు వచ్చాక వృద్ధుడిని అప్పగించారు.